క్లుప్తంగా

ధనమ్మమర్రికి భక్తుల తాకిడి

కపిలేశ్వరపురం: మండలంలోని కేదారిలంక గ్రామ శివారు వీధివారిలంకలోని ధనమ్మతల్లి దైవ, పర్యాటక క్షేత్రమైన ధనమ్మ మర్రిని అధిక సంఖ్యలో భక్తులు సందర్శించారు. విద్యాలయాలకు ఆదివారం సెలవు దినం కావడంతో మండలంతో పాటు కొత్తపేట, అయినవిల్లి, రామచంద్రపురం తదితర మండలాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియ ముమ్మరం



అంగర సచివాలయంలో కార్యదర్శి మహ్మద్ ఆలీ, వీఆర్వో నాగమణి

కపిలేశ్వరపురం: నూతన ఓటరు జాబితా తయారీ ప్రక్రియ ముమ్మరమైంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ కొమరం సూర్యారావు పర్యవేక్షణలోని 19 గ్రామాల బూత్ లెవెల్ ఆఫీసర్లు ఓటరు నమోదు ప్రక్రియలో నిమగ్నమయ్యారు. జనవరిలో ప్రకటించే నూతన ఓటరు జాబితా తయారీలో భాగంగా నిర్దేశించిన బీఎల్ఓలు శిశేష కృషి చేస్తున్నారు.

కొండపల్లి బాబూరావు సేవలు మరువలేనివి

కపిలేశ్వరపురం: సీపీఎం సీనియర్ నాయకులు కొండపల్లి బాబూరావు సేవలు మరువలేనివని ఆ పార్టీ నాయకులు కె.కృష్ణవేణి, జిత్తుక వీర్రాజు అన్నారు. అంగరలో ఆదివారం ఆపార్టీ నాయకులు బాబూరావు ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి బాబూరావు ఉద్యమించారని సీపీఎం నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం సభ్యులు, సీపీఎం నాయకులు, ఇతర ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



మండపేటలో ఉపాధ్యాయ దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మండపేట: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జమాయితె రూపొందించిన పోస్టర్‌ను పట్టణంలోని కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎం షరీఫ్ పర్యవేక్షణలో పోస్టర్‌ను రూపొందించినట్టు స్థానిక కమిటీ అధ్యక్షుడు అబులాల తెలిపారు. కార్యక్రమంలో సంఘం కోనసీమ జిల్లా నాయకులు అమీర్, షహీద్, ఇబ్రహీం, ఫారూఖ్, నజీర్, కమాల్ పాల్గొన్నారు.

99 శాతం పింఛన్ల పంపిణీ



లొల్లలో మంచంపై ఉన్న అవ్వకు పింఛన్ ఇస్తున్న వలంటీర్ కొమ్ము రంజని

రాయవరం: మండలం పరిధిలో ఆదివారం సాయంత్రానికి 99 శాతం మేర పింఛన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీవో కె.నరేంద్రరెడ్డి తెలిపారు. ప్రతి నెల ఒకటవ తేదీన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న విషయం అందరికీ తెలిసిందే. అందులో భాగంగా సెప్టెంబరు నెల పింఛన్లను శుక్రవారం వేకువజాము నుంచే వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పంపిణీ చేపట్టారు. మండలంలోని 12 గ్రామాలకు సంబంధించి 9,899 మందికి సామాజిక పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉంది. పింఛనుదారులకు రూ.6,58,06,894 పంపిణీ చేయాల్సి ఉంది. గ్రామాల్లో పింఛన్ల పంపిణీని పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించారు.

సంక్షేమానికి పెద్దపీట

మండపేట: సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ పెద్ద పీట వేస్తుందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని 9వ వార్డులో ఆదివారం బాబు ష్యూరిటీ–భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, కౌన్సిలర్ చుండ్రు చిన్న చౌదరి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో నా మట్టి–నా దేశం

మండపేట: పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం నా మట్టి–నా దేశం కార్యక్రమంలో భాగంగా ప్రజల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ జాతీయ కమిటీ పిలుపు మేరకు గ్రామాల నుంచి పిడికెడు మట్టిని సేకరించి దేశ రాజధాని ఢిల్లీకి పంపనున్నట్టు పార్టీ పట్టణ అధ్యక్షుడు మద్దుల సుబ్బారావు తెలిపారు.ఈ కారక్రమంలో మహిళా మోర్చా నాయకురాలు తాడిమళ్ల విజయవాణి, న్యాయవాది టీఎస్‌వీ రమణమూర్తి, నాయకులు కోన సత్యనారాయణ పాల్గొన్నారు.

ఒంటరైనా.. రైస్ కార్డుకు అర్హులే..

- వలంటీర్ల ద్వారా దరఖాస్తు
- గ్రామ సచివాలయాల్లో మంజూరు

రామచంద్రపురం రూరల్: రాష్ట్రంలో ప్రభుత్వ సంక్షేమం పొందడానికి అర్హులైన ఉండి పొందలేని వారి కోసం నిరంతరంగా ఆలోచించే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరుపడ్డారు. గతంలో ఒంటరి వ్యక్తులకు రేషన్‌కార్డు మంజూరు చేసే అవకాశం ఉండేది కాదు. కానీ ముఖ్యమంత్రి పాలన చేపట్టాక అటువంటి ఒంటరి వ్యక్తులపై వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కరుణ చూపింది. ఇది వరకు కుటుంబం ఉంటేనే రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండేది. వారికి మాత్రమే సంక్షేమ పథకాలు వర్తించేవి. ఒంటరిగా ఉండేవారు రేషన్‌కార్డు లేక పోవడంతో సంక్షేమ పథకాలకు నోచుకునేవారు కాదు. వారందరికీ లబ్ధి చేకూర్చాలని రైస్ కార్డుల నిబంధనల్లో రాష్ట్ర ప్రభుత్వం మార్పులు తెచ్చింది. ఒంటరి వ్యక్తులు కూడా రైస్ కార్డు పొందేలా మూడేళ్ల క్రితమే మార్గదర్శకాలు విడుదల చేసింది. దీంతో ఎన్నో ఏళ్లుగా రేషన్‌కార్డుల కోసం నిరీక్షిస్తున్న ఒంటరి వ్యక్తులు రైస్ కార్డులు పొంది ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుకుంటున్నారు. ఈ క్రమంలో ఒంటరి వ్యక్తులు ఏ కారణం చేతనైనా రైస్ కార్డులు పొందని వారు ఇప్పుడు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని రామచంద్రపురం తహసీల్దార్ పి.తేజేశ్వరరావు చెబుతున్నారు.

గ్రామ సచివాలయాల్లోనే..

ఒంటరిగా ఉంటున్న మహిళలు, పురుషులకు రైస్ కార్డులను మంజూరు కోసం వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. వీఆర్‌ఓలు దరఖాస్తులను పరిశీలించి తహసీల్దార్‌కు నివేదిస్తారు. అర్హులైన వారికి గ్రామ/వార్డు సచివాలయాల్లోనే రైస్ కార్డులను జారీ చేస్తారు. ఒంటరి వ్యక్తి రైస్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునేవారు తప్పనిసరిగా ఈ–కేవైసీ చేయించుకుని బయోమెట్రిక్ వేలిముద్రలు వేయాల్సి ఉంటుంది.

అర్హులు వీరే..

భర్త చనిపోయి పిల్లలు లేని ఒంటరి మహిళలు, అలాగే భార్య చనిపోయి పిల్లలు లేని ఒంటరి పురుషులు, 50 ఏళ్లు పైబడి పెళ్లి కాని పురుషుడు లేదా మహిళ, కుటుంబ సభ్యులు లేని నిరాశ్రయులు అర్హులే. ఇంకా ఒంటరి ట్రాన్స్‌జెండర్లు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇప్పటి వరకు ఏ రైస్‌కార్డులో లేని వారూ దరఖాస్తు చేసుకోవచ్చు.



ఒంటరి వ్యక్తులకు ప్రభుత్వం మంజూరు చేస్తున్న రైస్ కార్డు

అర్హులందరికీ కార్డులు



రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకత్వం మేరకు అర్హులై ఉండి వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి వారి అర్హతలను పరిశీలించి ఏడాదికి రెండు సార్లు కొత్త రైస్ కార్డులు మంజూరు చేయడం జరుగుతుంది. గత ప్రభుత్వాల్లో ఒంటరి వ్యక్తులకు రేషన్‌కార్డు మంజూరు చేయడానికి అవకాశం లేదు. ప్రస్తుతం ప్రభుత్వ ఆదేశాలతో ఒంటరి వ్యక్తులకు కూడా రైస్ కార్డులు మంజూరు చేస్తున్నాం. అర్హులైన వారు వలంటీర్ల ద్వారా గ్రామ/వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి.

– పి.తేజేశ్వరరావు, తహసీల్దార్, రామచంద్రపురం మండలం

రేపు ఏఎంసీ చైర్మన్‌గా రవీదేవి ప్రమాణ స్వీకారం



రెడ్డి రవీదేవి

కొత్తపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్‌గా రెడ్డి రవీదేవి మంగళవారం పదవీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రవీదేవి కుటుంబం ముఖ్యంగా ఆమె భర్త, అవిడి సర్పంచ్ రెడ్డి చంటి వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచీ పార్టీకి, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి విజయానికి కృషి చేస్తూ విశ్వసనీయతను చాటుకున్నారు. ఆ నేపథ్యంలో జగ్గిరెడ్డి సిఫారసు మేరకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కొత్తపేట ఏఎంసీ చైర్మన్‌గా రవీదేవిని నియమించారు. మరీ ముఖ్యంగా కొత్తపేట ఏఎంసీ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా బీసీ (శెట్టిబలిజ) సామాజిక వర్గానికి, అందునా మహిళకు ఈ పదవిని కట్టబెట్టడం ద్వారా ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఆ వర్గానికి గుర్తింపునిచ్చారు. ఆమె ప్రస్తుతం కోనసీమ తిరుపతిగా ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం వాడపల్లి వేంకటేశ్వరస్వామివారి దేవస్థానం పాలకమండలి సభ్యురాలిగా ఉన్నారు. రవీదేవి ప్రమాణ స్వీకార వివరాలను ఎంపీపీ మార్గన గంగాధరరావు, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు ఆదివారం విలేకరులకు వివరించారు. ఆ రోజు ఉదయం అవిడిలో రవీదేవి స్వగృహం తన స్వగృహం నుంచి భారీ ఊరేగింపుగా ఖండ్రిగ, పలివెల వంతెన, కొత్తపేట మెయిన్‌రోడ్డు, సత్యాసెంటర్, కౌశికరోడ్డు గుండా శ్రీకరి శుభకరి కల్యాణ మండపానికి చేరుకుంటారని తెలిపారు. 11 గంటలకు ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అధ్యక్షతన జరిగే సభలో పలువురు చట్టసభల ప్రతినిధులు పాల్గొనగా వారి సమక్షంలో రవీదేవి ప్రమాణస్వీకారం చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అత్యధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

పాలకమండలి సభ్యులు వీరే..

ఏఎంసీ పాలకమండలిలో గౌరవ చైర్మన్‌గా ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, చైర్మన్‌గా రెడ్డి రవీదేవి, వైస్ చైర్మన్‌గా ముదునూరి రామకృష్ణంరాజు (ఆత్రేయపురం), పాలకమండలి సభ్యులుగా కాళ్లకూరి అన్నపూర్ణ (వెలిచేరు), కడలి సుజాత (తాడిపూడి), షేక్ గౌసియాబేగం (రావులపాలెం), పిండ్రాళ్ల సత్య (పలివెల), అవిశెట్టి రామలక్ష్మి (బిళ్లకుర్రు), మల్లేశ్వరపు వెంకటలక్ష్మి (దేవరపల్లి), కరుటూరి నాగమణి (అంకంపాలెం), పమ్మి సింహాచలం (పొడగట్లపల్లి), పితాని వెంకటేశ్వరరావు (రావులపాడు), సాకా జానకిరామరాజు (వానపల్లి), వానపల్లి త్రిమూర్తులు (గోపాలపురం), సత్తి సూర్రెడ్డి (రావులపాలెం), ఉర్రింకల శ్రీనివాసరావు (ఉచ్చిలి), ముసునూరి వెంకటేశ్వరరావు (కొత్తపేట) నియమితులయ్యారు. వారితో పాటు అఫీషియల్ సభ్యులుగా హెడ్ క్వార్టర్ సర్పంచ్, ఏడీఏ, మార్కెటింగ్ ఏడీ కమిటీలో ఉంటారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన విజయ్‌కుమార్

కె.గంగవరం: అప్పుల బాధతో రామచంద్రాపురానికి చెందిన శామ్యూల్ విజయ్‌కుమార్ గోదావరిలో దూకి ఆత్మహత్యాయత్నం చేయగా స్థానికులు రక్షించి ఆసుపత్రికి తరలించారు. ఎస్సై షేక్ జానీ భాషా తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం సాయంత్రం మండలంలోని కోటిపల్లిలోని శ్మశానవాటిక వద్ద గుర్తు తెలియని వ్యక్తి గోదావరిలో దూకాడు. అక్కడే ఉన్న యువకులు అతన్ని రక్షించి 108కి సమాచారం అందించి రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కె.గంగవరం ఎస్సై ఎంక్వయిరీ చేయగా రామచంద్రపురానికి చెందిన విజయ్‌కుమార్‌గా గుర్తించారు. ప్రస్తుతం విజయ్‌కుమార్ ఆరోగ్యం నిలకడగా ఉందని కాకినాడలో చికిత్స పొందుతున్నాడని అప్పుల బాధలు తాళలేక ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడని ఎస్సై తెలిపారు.

రహదారి నిర్మాణంలో జాప్యంపై నిరసనకు సన్నద్ధం

మండపేట: మండపేట–ద్వారపూడి రహదారి నిర్మాణంలో జాప్యాన్ని నిరసిస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో సోమవారం భిక్షాటన, 6న ధర్నా కార్యక్రమాలు చేపట్టాలని ఇప్పనపాడులో ఆదివారం నిర్వహించిన సమావేశంలో నిర్ణయించినట్టు నేతలు తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు, జనసేన నాయకులు వేగుళ్ళలీలాకృష్ణ, పలు ప్రజాసంఘాల నేతలు ధూళి జయరాజు, కె.కృష్ణవేణి, గొడవర్తి రామచంద్రరావు పాల్గొన్నారు.

సాత్విక్ సాయిరాజ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి



పోటీల విజేతలతో ఆర్డీవో వసంతరాయుడు, వాకర్స్, ఆఫీసర్స్ క్లబ్‌ల ప్రతినిధులు

అమలాపురం టౌన్: మండల షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు అమలాపురం నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆర్డీవో వసంతరాయుడు అన్నారు. అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్, ఆఫీసర్స్ రీక్రియేషన్ క్లబ్ సంయుక్త ఆధర్యంలో స్థానిక ఆఫీసర్స్ క్లబ్ ఇండోర్ కోర్టులో జరుగుతున్న మండల స్థాయి జూనియర్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీవో వసంతరాయుడు విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీలను విజయవంతంగా నిర్వహించిన కోనసీమ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్‌ను ఆర్డీవో అభినందించారు. అండర్–11, అండర్–13, అండర్–15 మూడు విభాగాల్లో క్రీడాకారులకు పోటీలు నిర్వహించినట్లు వాకర్స్ క్లబ్ కార్యదర్శి, విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ రంకిరెడ్డి కాశీ విశ్వనాథ్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ ఉపాధ్యక్షుడు డాక్టర్ మెట్ల వెంకట సూర్యనారాయణ, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, కార్యదర్శి పుత్సా కృష్ణ కామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

‘కాశీ అన్నపూర్ణాదేవి’ సేవలు అభినందనీయం

- ఘనంగా సేవా సమితి ప్రథమ వార్షికోత్సవం
- సేవా సమితి గౌరవ అధ్యక్షుడిగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగిరెడ్డి



ప్రథమ వార్షికోత్సవంలో సేవాతత్పరులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, సేవా సమితి సభ్యులు



కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి గౌరవాధ్యక్షుడిగా ఎన్నికైన ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, అధ్యక్షుడిగా ఎన్నికైన సతీష్‌రెడ్డి

రావులపాలెం: ఏడాది కాలంలో కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు సంఘటితంగా ఏర్పడి చేసిన సేవలు అభినందనీయం అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి కొనియాడారు. ఆదివారం సేవా సమితి ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రావులపాలెం కాలువ అవతల రామాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జగ్గిరెడ్డి మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా సేవచేయాలనే తపనతో 150 మందితో శ్రీకాశీ అన్నపూర్ణాదేవి సేవాసమితి పేరిట సేవా సంస్థను ఏర్పాటు చేసి ఈ సంవత్సర కాలంలో వృద్ధులకు, వికలాంగులకు, వివిధ అనారోగ్యాలతో బాధపడుతున్న వారికి, అగ్నిప్రమాదాలలో ఇల్లు కోల్పోయిన వారికి రూ.8 లక్షల నగదును ఆర్థిక సహాయంగా అందజేసి వివిధ సేవా కార్యక్రమాలు చేయడం చాలా అభినందనీయమన్నారు. నిస్వార్థంగా చేసిన సేవ మనకు ఏదో ఒక రూపంలో తిరిగి తోడుగా నిలుస్తుంది అని, తాను 3 సార్లు శాసనసభ్యుడిగా గెలుపొందడం వెనుక వివిధ సేవా కార్యక్రమాలు కూడా ఒక కారణం అన్నారు. ఈరోజు ఇలాంటి మంచి కార్యక్రమంలో పాల్గొనడం ఒక అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా సేవా సమితి గౌరవ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే సంస్థ అధ్యక్షుడిగా గొలుగూరి వెంకట సత్యనారాయణ రెడ్డి (సతీష్ రెడ్డి), సంస్థను తొలి నుంచి నడిపిస్తున్న మల్లిడి మాధవిని కార్యదర్శిగా ఎన్నుకున్నారు. వీరందరికీ జగ్గిరెడ్డి అభినందనలు తెలిపారు.

అనంతరం ర్యాలి గ్రామానికి చెందిన శ్యామ్ జాదూగర్, ఊబలంక మదర్‌థెరిసా ఆశ్రమం నిర్వహకుడు దిడ్ల కిషోర్ ఆశ దంపతులను, రావులపాలెం పీపుల్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు చెందిన కొవ్వూరి సుధాకర్ రెడ్డి, కర్రి సోమిరెడ్డి, రావులపాలెం కాలువ అవతల ఉన్న బ్రైట్ లైట్ అంధుల పాఠశాలకు చెందిన సింహాద్రి, వెదిరేశ్వరం గ్రామానికి చెందిన సోషల్ వర్కర్ సుబ్బాయమ్మ, కేఎస్ఆర్ లైటింగ్ అధినేత కాశీ విశ్వేశ్వర రెడ్డి, ఎస్‌వీ ఈవెంట్స్ అధినేత కొవ్వూరి ధర్మారెడ్డి, వివిధ రకాలుగా ప్రజలకు సేవలందించిన పలువురికి ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి చేతుల మీదుగా దుశ్శాలువాతో సన్మానించి మెమెంటోలు అందజేశారు. సంస్థను ఇలానే ఇంకా ఎన్నో మంచి కార్యక్రమాలు చేయాలని కోరుతూ కాశీ అన్నపూర్ణా దేవి సేవాసమితి సభ్యత్వాన్ని ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, రావులపాలెం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు నాగిరెడ్డి కుటుంబ సభ్యులు సభ్యత్వం తీసుకున్నారు. అనంతరం లివర్ వ్యాధితో బాధపడుతున్న ఆలమూరు మండలం సూర్యారావుపేట గ్రామానికి చెందిన టేకిమూడి బాల వీర వెంకట సాయి తేజకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆపరేషన్ నిమిత్తం రూ.10 లక్షల ఎల్‌ఓసీని అందజేయగా, వారి కుటుంబసభ్యులకు సంస్థ తరపున రూ.15 వేల నగదును ఆర్థిక సహాయం ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో రావులపాలెం ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సాకా ప్రసన్నకుమార్, మన్యం వర్ధనరావు ఊబలంక ఉప సర్పంచ్ కొవ్వూరి దుర్గారెడ్డి, రావులపాలెం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కర్రి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు దుప్పలపూడి ఉపసర్పంచ్ ఎన్నిక

గ్రామంలో 144 సెక్షన్ విధింపు

అనపర్తి: మండలంలోని దుప్పలపూడి గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ ఎన్నిక సోమవారం నిర్వహించనున్నారు. ఎన్నిక ప్రశాంతంగా జరిగేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామంలో భారీ బందోబస్తు ఏర్పాటుచేయడంతో పాటు పరిస్థితుల దృష్ట్యా గ్రామంలో 144 సెక్షన్ విధించారు. 2021లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో దుప్పలపూడి పంచాయితీ పరిధిలోని 10 వార్డు స్థానాలకు గాను 8 స్థానాల్లో వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు, ఒక స్థానంలో ఇండిపెండెంట్, మరో స్థానంలో టీడీపీ సానుభూతిపరుడు గెలుపొందారు. 1, 9వ వార్డు సభ్యులుగా గెలుపొందిన అభ్యర్థులు వివిధ కారణాలతో తమ పదవులకు రాజీనామా చేయడంతో గత నెల 19వ తేదీన వార్డు స్థానాలకు ఉపఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో గ్రామానికి చెందిన వల్లభశెట్టి రామసతీష్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు ఇద్దరూ భారీ మెజార్టీతో విజయం సాధించారు.

ఎన్నిక లాంఛనమేనన్న చర్చ

గ్రామంలో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో సర్పంచ్ నల్లమిల్లి సావిత్రి ఇటీవలే తన అనుచరులైన ఐదుగురు వార్డు సభ్యులతో కలిసి వైఎస్సార్ సీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ ప్రకటనతో నూతనంగా ఎన్నికైన ఇద్దరితో కలిపి మొత్తం నలుగురు వార్డు సభ్యుల మద్దతు మాత్రమే వైఎస్సార్ సీపీకి ఉండడంతో ఉపసర్పంచ్ ఎన్నిక రసకందాయంలో పడింది. అయితే సర్పంచ్ వర్గీయులు వైఎస్సార్ సీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన నాలుగు రోజులకే ఆ వర్గం నుంచి ఇద్దరు వార్డు సభ్యులు వైఎస్సార్ సీపీకే తమ సంపూర్ణ మద్దతు అని ప్రకటించారు. దీంతో తిరిగి వైఎస్సార్ సీపీ వర్గానికే ఆరుగురు వార్డు సభ్యుల మద్దతు లభించినట్లైంది. ఈ నేపథ్యంలో సోమవారం జరగనున్న గ్రామ ఉపసర్పంచ్ పదవి వైఎస్సార్ సీపీకి వర్గీయులకు దక్కడం లాంఛనమేనన్న చర్చ స్థానికంగా సాగుతుంది.

శ్మశానవాటిక సమస్యలపై నిరసన

మామిడికుదురు: స్థానిక శ్మశానవాటికలో నెలకొన్న సమస్యలపై జనసేన నేతలు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలోని చెత్త అంతా తీసుకు వచ్చి శ్మశానంలో వేస్తున్నారని, దీని వల్ల తీవ్ర ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరైనా చనిపోయినప్పుడు శవాన్ని తీసుకు వచ్చే వారు తీవ్ర దుర్వాసనతో అవస్థలు పడుతున్నారని వాపోయారు. ఇక్కడ నెలకొన్న సమస్యలపై తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ పార్టీ నేతలు రుద్రా శ్రీనివాస్, మట్టా సత్తిబాబు, యాలి రాంబాబు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

రావులపాలెం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం ఉదయం 10:30 గంటలకు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో జి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఎంపీపీ కర్రి లక్ష్మీవెంకట నాగదేవి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి హాజరవుతారన్నారు. ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు. అలాగే అధికారులు శాఖల వారీగా ప్రగతి నివేదికతో రావాలన్నారు.

భవన నిర్మాణానికి విరాళాలు



దాతలకు స్వామి చిత్రపటం అందజేస్తున్న చైర్మన్ రమేష్‌రాజు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన భవన నిర్మాణానికి ఆత్రేయపురం మండలం నార్కెడ్‌మిల్లికి గ్రామానికి చెందిన చిన్న–సూర్యకళ దంపతులు రూ.30 వేలు, బిక్కవోలు మండలం కొంకుదురు గ్రామానికి చెందిన పి.సత్యస్వరూప్‌రెడ్డి–మమత నమ్రత దంపతులు రూ.10,116, గుడివాడకు చెందిన జి.గోసాయి నాగ యోగేశ్వర్‌రెడ్డి రూ.10,116, రామచంద్రపురానికి చెందిన కె.శరణ్‌కుమార్–అనూష సాయి దంపతులు రూ.10,001 విరాళం అందించినట్లు చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. దాతలకు ఆలయ చైర్మన్ చేతుల మీదుగా స్వామి చిత్రపటం అందజేశారు.

ప్రతి నీటి బొట్టూ.. ఒడిసి పట్టు

- సాగునీటి సరఫరాలో శాస్త్రీయ విధానం
- ఖరీఫ్ పూర్తయ్యే వరకూ నీటి సరఫరాకు ప్రభుత్వం భరోసా
- రెండు నియోజవర్గాల్లో 1,00,667 ఎకరాల్లో సాగు
- 11,58,33,750 మిల్లీమీటర్ల నీరు అవసరం



కపిలేశ్వరపురం: వరి సాగుకు ప్రణాళికాబద్ధంగా నీటిని సరఫరా చేయడం అత్యంత కీలకం. ఖరీఫ్ సాగు నాట్లు పూర్తయిన నాటి నుంచి పంట చేతికందే వరకూ ప్రతి నీటి బొట్టునూ ఒడిసి పట్టి సాగు నీటిని పంట పరిస్థితుల ఆధారంగా సక్రమంగా అందించాల్సిన అవసరముంది. ఇప్పటికే ప్రభుత్వం సాగునీటి సరఫరాపై అంచెలంచెలుగా చర్చించి విజయవంతంగా నీటినందిస్తోంది. రెండు నియోజకవర్గాల పరిధిలో సాగు నీటి సరఫరా తీరుతెన్నులను పరిశీలిద్దాం.

రెండు నియోజకవర్గాల్లో సాగు వివరాలు

ఒక ఎకరా వరి సాగు కాలం మొత్తానికి 1,250 మిల్లీమీటర్ల నీరు అవసరం. రామచంద్రపురం నియోజవర్గంలో 75 గ్రామాల్లో 53,249 ఎకరాలకు 6,65,61,250 మిల్లీమీటర్లు, మండపేట నియోజవర్గంలో 43 గ్రామాల్లో 47,418 ఎకరాలకు 4,92,72,500 మి.మీటర్లు మొత్తం రెండు నియోజకవర్గాల పరిధిలోని 120 గ్రామాల్లో 1,00,667 ఎకరాలకు 11,58,33,750 మిల్లీమీటర్ల సాగునీరు అవసరమవుతుంది.

పక్కా ప్రణాళిక ప్రకారం

రైతు పక్షపాతిగా పేరొందిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పంట సాగులో ముందస్తు ప్రణాళికను రూపొందిస్తూ ముందుకు సాగుతోంది. దానిలో భాగంగా రబీ సాగు కొనసాగుతుండగానే ఖరీఫ్ సాగుపై దృష్టి సారించింది. సాగునీటి సరఫరాకు ఇరిగేషన్, అనుబంధ శాఖలతో జిల్లాస్థాయిలో సమీక్షలు చేసి పక్కా ప్రణాళికను రూపొందించారు.

తోడ్పాటునిస్తున్న సాగు సలహా మండళ్లు

ప్రస్తుత ప్రభుత్వం రూపొందించిన వివిధ దశల్లోని సాగు సలహా మండళ్లు సాగు ప్రక్రియకు తోడ్పాటు నిస్తున్నాయి. ఆర్‌బీకే స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకూ సాగు సలహా మండళ్లను ఏర్పాటు చేసింది. దీంతో స్థానిక రైతు సూచనలు, సలహాలు ఉన్నత స్థాయిలో తీసుకునే నిర్ణయాల్లో భాగమవుతున్నాయి. ఆ మండళ్లలో రెవెన్యూ, జలవనరులు, వ్యవసాయ శాఖల భాగస్వామ్యం ఉండటంతో పటిష్టమైన నిర్ణయాలకు అవకాశం ఏర్పడుతుంది.

క్షేత్ర స్థాయిలో వరి సాగు నీటి అవసరాలు

మండలం	గ్రామాలు	సాగు విస్తీర్ణం	అవసరమైన నీరు (మి.మీలో)
రామచంద్రపురం	25	18,806	2,35,07,500
కె.గంగవరం	26	15,656	1,95,70,000
కాజులూరు	26	18,787	2,34,83,750
మండపేట	12	16,892	2,11,15,000
రాయవరం	12	14,646	1,83,07,500
కపిలేశ్వరపురం	19	15,880	1,98,50,000
మొత్తం	120	1,00,667	11,58,33,750

నీటి వినియోగంలో అవగాహన అవసరం



ఎగువ భూములున్న రైతులు ఎక్కువ నీటిని వినియోగిస్తుండటంతో పల్లపు రైతులకు సమస్య ఎదురవుతుంది. దీంతో వారి భూముల్లో దిగుబడి తగ్గే పరిస్థితులు ఎదురవుతాయి. నేలలో పైరుకు తడి 75 శాతం వరకూ తగ్గిపోతే నీటి ఎద్దడి ఉందంటారు. అలాగని అవసరం రాకుండా ముందస్తుగా నీరందించినా ప్రాణవాయువు దక్కక పంట దిగుబడి తగ్గిపోతుంది. నాట్లు వేసేటప్పుడు నీరు పలుచగానూ, మూన తిరిగిన రోజు నుంచి పైరు దుబ్బు చేయడం పూర్తయ్యే వరకూ 2 సెంటీమీటర్లు నీరు ఉంటే సరిపోతుంది. చిరుపొట్ట దశ నుంచి గింజ గట్టి పడే వరకూ 5 సెం.మీ నీరుండాలి. ఈనిక దశ, చిరుపొట్ట దశల్లో ఎట్టి పరిస్థితిలోనూ నీటి ఎద్దడి లేకుండా జాగ్రత్త వహించాలి. కోతకు పది రోజులు ముందుగా నీటిని నెమ్మదిగా తగ్గించాలి. నీరు ఎక్కువగా ఉంటే పైరు దుబ్బు బాగా చేయదు.

– కేవీఎస్ రమేష్ కుమార్, ఏఓ, కపిలేశ్వరపురం మండలం